సంక్షేమ భవన్ ముట్టడిలో దాసరి ఉష

ఆందోళనలో పాల్గొన్న దాసరి ఉష

పెద్దపల్లి, నవంబర్27: బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో బుధవారం హైదరాబాద్‌లోని సంక్షేమ భవన్ ముట్టడిలో బీఆర్ఎస్ నాయకురాలు దాసరి ఉష పాల్గొన్నారు. గురుకులాల్లో ఫుడ్ పాయిజన్‌తో చాలా మంది విద్యార్థులు ప్రాణాలు కోల్పోయినా, వందల మంది అనారోగ్యానికి గురైనా రాష్ట్ర ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవరించటం సిగ్గు చేటని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వసతి గృహాల విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని డిమాండ్ చేశారు.

పరామర్శ

సుల్తానాబాద్‌రూరల్,నవంబర్27: కనుకుల మాజీ ఉపసర్పంచ్ షమీమ్-అష్జల్ తండ్రి మహమ్మద్ అంకూస్ ఇటీవల మృతి చెందాడు. బాధిత కుటుంబాన్ని బీఆర్ఎస్ నాయకురాలు దాసరి ఉష పరామర్శించారు. మృతుడి చిత్రపటానికి పూలమాల వేసి వివాళులర్పించారు. వెంట నాయకులు రౌతు బాపన్న, గరిగంటి కుమార్ బాబు, గుండ రమేశ్, తుమ్మ రాజేశం, మీస శ్రీనివాస్, పల్లెర్ల రాజు, సిరిపురం అంజయ్య, కాంపెల్లి రాజేశం, కార్యకర్తలు ఉన్నారు.

చివరి దశకు ధాన్యం కొనుగోళ్లు

సుల్తానాబాద్ రూరల్, నవంబర్ 27: ధాన్యం కొనుగోళ్లు చివరి దశకు చేరాయని హమాలీ సంఘం నాయకుడు గోస్కుల సదయ్య తెలిపారు. సుల్తానాబాద్ పీఏసీఎస్ ఆధ్వర్యంలో కదంబాపూర్‌లో 25 రోజుల క్రితం ఏర్పాటు చేసిన కేంద్రంలో ధాన్యం కొనుగోళ్లను త్వరగా పూర్తి చేసిన సందర్భంగా బుధవారం హమాలీలు సంబరాలను చేసుకున్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో ఒకరికి జైలు

పెద్దపల్లి కమాన్, నవంబర్ 27 : పెద్దపల్లి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ అనిల్ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన ఆరుగురు మందుబాబులకు కౌన్సిలింగ్ నిర్వహించి బుధవారం పెద్దపల్లి సబ్‌కోర్టులో హాజరుపర్చారు. కేసు విచారించిన జూనియర్ సివిల్ జడ్జి ఎన్ మంజుల ఐదుగురికి రూ. 9800 జరిమానా విధించారు. మహారాష్ట్రకు చెందిన నాగ్సేన్ గవండే అతిగా మద్యం తాగి లారీ నడుపుతూ పట్టుబడ్డాడు. అతనికి నాలుగు రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు. మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని న్యాయమూర్తి హెచ్చరించారు.

టౌన్ ప్లానింగ్ అధికారులను సస్పెండ్ చేయాలి

కోల్‌సిటీ, నవంబర్ 27: రామగుండం నగర పాలక సంస్థ పరిధిలోని కాశీపల్లిలో సెల్లార్ అనుమతి లేకుండానే ఓ హోటల్ యజమాని నిర్మాణం చేపట్టారని, టౌన్ ప్లానింగ్ అధికారులపై విచారణ జరిపించి సస్పెండ్ చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మార్కపురి సూర్య డిమాండ్ చేశారు. ఈమేరకు నగర పాలక సంస్థ ఇన్‌చార్జి కమిషనర్, అదనపు కలెక్టర్ జే అరుణ శ్రీకి బుధవారం వినతి పత్రం అందజేశారు. కార్పొరేషన్‌లో అనేక అక్రమ నిర్మాణాలు జరుగుతున్నా టౌన్ ప్లానింగ్ అధికారులు చోద్యం చూడడం వెనుక అవకతవకలకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయన్నారు. కళ్యాణ్‌నగర్‌లో ప్రధాన నాలాపై నిర్మాణాలు జరుగుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. కాశిపల్లిలో శ్రీమయి లగ్జరీ హోటల్ వెనుకాల ఒక పెద్ద భవనం నిర్మిస్తున్నారని, ఆ భవనానికి ఎలాంటి సెల్లార్ అనుమతులు లేవని ఆరోపించారు. అక్రమ నిర్మాణాలపై వెంటనే చర్యలు చేపట్టాలన్నారు. అలాగే అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న టౌన్ ప్లానింగ్ అధికారులను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సాదుల శివ, ఆసాల నవీన్, రాణవేని సుధీర్ పాల్గొన్నారు.

ప్రజాభిప్రాయ సేకరణ వాయిదా

జ్యోతినగర్, నవంబర్ 27: టీఎస్టీపీపీ(తెలంగాణ సూపర్ థర్మల్ పవర్ ప్రాజెక్టు) ఫేస్ 2 కింద చేపట్టనున్న ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం వాయిదదా పడింది. రామగుండం ఎన్టీపీసీలో ఎన్టీపీసీ ఆధ్వర్యంలో తెలంగాణ ఫేస్ 2 కింద చేపట్టనున్న 2,400మెగావాట్ల విద్యుదుత్పత్తి ప్రాజెక్టు నిర్మాణానికి ఈ నెల 29న జరగాల్సిన ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం అనివార్య కారాణాలతో వాయిదా పడింది. తిరిగి డిసెంబర్ 19న ప్రజాభిప్రాయ సేకరణకు తేదీ ఖరారైంది. ఈ మేరకు బుధవారం ప్రాంతీయ కాలుష్య నియంత్రణ మండలి ఇంజినీర్ సమర్పించిన నోట్‌ఫైల్ నివేదికలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ప్రజాభిప్రాయ సేకరణ తేదీని వాయిదా వేస్తూ, డిసెంబర్ 19న ఖరారు చేశారు. ఎన్టీపీసీ టీటీఎస్‌లోని జిల్లా ప్రజాపరిషత్ హైస్కూల్ క్రీడా మైదానంలో నిర్వహించే ఈ ప్రజాభిప్రాయ సేకరణకు అంతకు ముందు వెల్లండించిన తేదీ ఖరారు నుంచి ఎన్టీపీసీ, కాలుష్య నియంత్రణ మండలి ముందుస్తుగా ఏర్పాట్లను పూర్తి చేసుకుంటు వస్తున్నారు. ఈక్రమంలో జిల్లా కలెక్టర్ శాంతిభద్రతల చర్యల నిమిత్తం తీసుకున్న చర్యలతోనే 20 రోజుల దాకా ప్రజాభిప్రాయ సేకరణకు బ్రేక్ పడినట్లుగా తెలిసింది.

మండప నిర్మాణానికి భూమిపూజ

జ్యోతినగర్, నవంబర్ 27: ఎన్టీపీసీ మూడో డివిజన్ పరిధి మేడిపల్లిలో పురాతన హనుమాన్ ఆలయంలో మండపం నిర్మాణానికి డివిజన్ కార్పొరేటర్ కుమ్మరి శ్రీనివాస్, గ్రామపెద్దలు చెప్యాల కేశవరావు బుధవారం భూమిపూజ చేశారు. రెండేళ్లక్రితం గ్రామస్తుల సహకారంతో నూతనంగా దేవాలయం నిర్మించారు. తాజాగా ఆలయ మండప నిర్మాణానికి చెప్యాల రామ్‌కిషన్ సతీ మణి విజయలక్ష్మి వారసులు భూ దానం చేశారు. భూ దాతకు గ్రామస్తుల తరుపున కృతజ్ఞతలు తెలిపారు. అర్చకులు సంతోష్ శర్మ, వాస్తుశిల్పి నర్సయ్య, సింగం మల్లికార్జున్‌గౌడ్, ముసిపట్ల రాజు, మడ్డి చంద్రయ్యగౌడ్, రావికంటి నాగన్న ఉన్నారు.

మహిళా ఉద్యోగులు ప్రమోషన్లు పొందాలి

యైటింక్లయిన్ కాలనీ, నవంబర్ 27: సింగరేణిలోని మహిళా ఉద్యోగులు ప్రమోషన్లు పొందాలని ఆర్జీ-3 ఎస్‌వోటు జీఎం రఘుపతి సూచించారు. ఆర్జీ-3 ఓసీపీ-1 గనిలోని వివిధ విభాగాలలో పని చేస్తున్న మహిళా బదిలీ వర్కర్లు, జనరల్ మజ్దూర్ ఉద్యోగులకు సర్వేస్‌లో గల 16 డిసిగ్నేషన్‌ల ఉద్యోగాల గురించి వివరిస్తూ కమిటీ కన్వీనర్ రఘుపతి ఆధ్వర్యంలో బుధవారం ఓసీపీ-1లో కౌన్సిలింగ్ నిర్వహించారు. మొత్తం 22 మంది మహిళా ఉద్యోగులు హాజరయ్యారు. 16 డిసిగ్నేషన్‌లలో మహిళా ఉద్యోగులకు తగిన శిక్షణ అందించి సంబంధిత ఉద్యోగాలకు పంపించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రాజెక్టు అధికారి రాజశేఖర్, డీజీఎం చంద్రశేఖర్, సుదర్శనం, డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి, డిప్యూటీ పీఎం సునీల్ ప్రసాద్ పాల్గొన్నారు.

గురుకులాలను భ్రష్టు పట్టిస్తున్న కాంగ్రెస్

ఫర్టిలైజర్‌సిటీ, నవంబర్ 27: గురుకుల పాఠశాలలను కాంగ్రెస్ ప్రభుత్వం భ్రష్టు పట్టిస్తున్నదని బీఆర్ఎస్ రామగుండం నియోజకవర్గ సమన్వయ కమిటీ సభ్యులు ఈదునూరి నర్సింగ్ బుధవారం ఆరోపించారు. కేసీఆర్ గురుకుల పాఠశాలలకు ప్రాణం పోస్తే, నేడు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాణం తీస్తున్నదని ఆరోపించారు. కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని వాంకిడి గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఫుడ్ పాయిజన్‌తో తొమ్మిదో తరగతి విద్యార్థిని శైలజ మృతిచెందడం దురదృష్టకరమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో వచ్చినప్పటి నుంచి తరుచుగా ప్రభుత్వ పాఠశాలలు, గురుకుల కళాశాలలో కలుషిత ఆహారంతో ఫుడ్ పాయిజన్, ఇతర కారణాలతో ఎంతోమంది విద్యార్థులు మృతి చెందుతున్న రాష్ట్ర మంత్రులు, అధికారులు ఏమాత్రం పర్యవేక్షణ లేకపోవడం సిగ్గు చేటని విమర్శించారు. ఇలాంటి ఘటనలు మళ్లీ పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

యంత్రాలను పూర్తి స్థాయిలో వినియోగించాలి

రామగిరి, నవంబర్ 27: యంత్రాలను పూర్తి స్థాయిలో వినియోగించి నిర్దేశించిన లక్ష్యాలను సాధించాలని ఏపీఏ జీఎం కే వెంకటేశ్వర్లు అన్నారు. అడ్రియాల లాంగ్‌వాల్ ప్రాజెక్టు ఆవరణలో నూతనంగా కొనుగోలు చేసిన జీపీఎల్ 215కు చెందిన ఎఫ్‌బీఎల్ యంత్రాన్ని బుధవారం ప్రారంభించారు. యంత్రాలను పూర్తి స్థాయిలో వినియోగించి నిర్దేశించి లక్ష్యాలను భద్రతతో సాధించుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రాజెక్టు అధికారి కొలిపాక నాగేశ్వరరావు, మేనేజర్ కోరెం జనార్దన్, ఇంజనీర్ రఘురాం, అధికారులు బాలరాజు, వేణుకుమార్, రవిచంద్ర, కార్మిక సంఘాల నాయకులు గంగాధర్, కొమురయ్య పాల్గొన్నారు.

సన్మానం

గోదావరిఖని, నవంబర్ 27: సింగరేణి ఆర్జీ-1లో పర్సనల్ మేనేజర్ డీ కిరణ్‌బాబు కు డీజీఎం పర్సనల్‌గా పదోన్నతితో బాధ్యతలు స్వీకరించడం పట్ల బుధవారం ఆర్జీ-1 స్కూట్ అండ్ రోవర్స్ డిస్ట్రిక్ట్ ఆర్గనైజింగ్ కమిషనర్ సీనియర్ పర్సనల్ ఆఫీసర్ బంగారు సారంగపాణి మర్యాద పూర్వకం గా కలిసి శాలువతో సన్మానించారు. స్కూట్ అండ్ రోవర్స్ బుచ్చయ్య, దొడ్డి కుమార్, గుంటి కుమార్, టీ కుమార్ ఉన్నారు.

ఆకట్టుకున్న వైజ్ఞానిక ప్రదర్శన

రామగిరి, నవంబర్ 27: మండలంలోని సెంటినరీకాలనీలో గల ప్రగతి ఉన్నత పాఠశాలలో బుధవారం వైజ్ఞానిక ప్రదర్శన ఆకట్టుకుంది. పాఠశాల విద్యార్థులు వివిధ రకాల ఎగ్జిబిట్స్‌ను ప్రదర్శించారు. ఆహారం, ఆరోగ్యం, పరిశుభ్రత, రవాణా, వ్యర్థాల నిర్వహణ, వనరుల నిర్వహణ, గణిత నమూనాలు, కంప్యూటరైజేషన్‌పై దాదాపు 80 రకాల నమూనాలను ప్రదర్శించారు. విద్యార్థులను పాఠశాల కరస్పాండెంట్ అబ్బు కేశవరెడ్డి అభినందించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి రాము, ఉపాధ్యాయులు సత్యనారాయణ, రవీందర్, వీర రాజు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఖని దవాఖానలో ల్యాప్రోస్కోపిక్ శస్త్రచికిత్స

ఫర్టిలైజర్‌సిటీ, నవంబర్ 27: కార్పొరేట్ దవాఖానలకు పరిమితమైన ల్యాప్రోస్కోపిక్ శస్త్రచికిత్స బుధవా రం గోదావరిఖని ప్రభుత్వ జనరల్ దవాఖానలో విజయ వంతంగా జరిగింది. ఈ మేరకు బుధవారం అపెండి సెక్టమీతో బాధపడుతున్న ఓ రోగికి దవాఖాన జనరల్ సర్జరీ హెచ్ఓడీ శ్రీనివాస్ పర్యవేక్షణలో వైద్యులు మొదటి సారిగా ల్యాప్రోస్కోపిక్ ఆపరేషన్‌ను పూర్తి చేశారు. ఈ ఆపరేషన్‌ను విజయవంతంపై వైద్య బృందాన్ని మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ హిమబిందో సింగ్ అభినందించారు.

ఏఎల్‌సీని కలిసిన ఆర్జీ-3 పర్సనల్ అధికారి

రామగిరి, నవంబర్ 27: మంచిర్యాల రీజియన్ నూతన అసిస్టెంట్ లేబర్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన యూసుఫ్ చౌటుపల్లిని రామగుండంలోని ఆయన కార్యాలయంలో ఆర్జీ-3 పర్సనల్ విభాగాధిపతి సుదర్శనం బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.ఆర్జీ-3 ఏరియాలో పెండింగ్‌లో ఉన్న కేసులను పరిష్కరించేందుకు సహకరించాలని కోరారు. ఆయన వెంట ఐఈ డీజీఎం చంద్రశేఖర్, పీఓ రాజేశం తదితరులున్నారు.

క్వింటాలు పత్తి ధర రూ. 7021

పెద్దపల్లి, నవంబర్27: పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్‌లో క్వింటాలు పత్తి ధర గరిష్ఠంగా రూ. 7021 పలికింది. బుధవారం 148 మంది రైతులు తీసుకొచ్చిన 625 క్వింటాళ్ల పత్తిని వ్యాపారులు కొనుగోలు చేయగా, క్వింటాలుకు గరిష్ఠ ధర రూ. 7021, కనిష్ఠ ధర రూ. 5716, మోడల్ ధర రూ. 6861 లభించిందని మార్కెట్ సెక్రటరీ దేవరాజ్ పృథ్వీరాజ్ తెలిపారు.

షార్ట్ సర్క్యూట్‌తో మున్సిపల్ వాహనం దగ్ధం

కోల్‌సిటీ, నవంబర్ 27: రామగుండం నగర పాలక సంస్థ ఆటో ట్రాలీ షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైంది. బుధవారం ఎప్పటిలాగే 7వ డివిజన్ నుంచి సేకరించిన చెత్త, ప్లాస్టిక్ వస్తువులు గౌతమినగర్‌లోని యార్డుకు తరలించి తిరిగి వస్తుండగా, మార్గమధ్యంలో హఠాత్తుగా ఇంజిన్‌లో నుంచి మంటలు వ్యాపించడంతో డ్రైవర్ మనోజ్ గమనించి వాహనాన్ని అక్కడే నిలిపి బయటకు వచ్చాడు. వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వగా, ఫైరింజన్ సంఘటన స్థలంకు ఆలస్యంగా వచ్చేసరికి అప్పటికే ఆటో ట్రాలీ మంటల్లో పూర్తిగా కాలిపోయింది. ఈ సంఘటనతో కార్పొరేషన్‌కు రూ.4.5 లక్షల నష్టం వాటిల్లినట్లు శానిటరీ ఇన్‌స్పెక్టర్ సునీల్ తెలిపారు.

పోటు ప్రసాద్ మరణం తీరని లోటు

కోల్‌సిటీ, నవంబర్ 27: సీపీఐ ఖమ్మం జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ అకాల మరణం ప్రజా ఉద్యమాలకు తీరని లోటని ఆ పార్టీ నాయకులు గోసిక మోహన్, గౌతం గోవర్ధన్, కే కనకరాజ్, తాళ్లపల్లి మల్లయ్య పేర్కొన్నారు. రాష్ట్ర సాధన ఉద్యమంలో పోటు ప్రసాద్ కీలకంగా పని చేశారని గుర్తు చేసుకున్నారు. ఆయన కుటుంబమంతా కమ్యూనిస్టు పార్టీ కోసం పని చేసిందని తెలిపారు.

33వ డివిజన్‌లో రోడ్లు అధ్వాన్నం

కోల్‌సిటీ, నవంబర్ 27: నగరంలోని 33వ డివిజన్‌లో రోడ్లు అధ్వానంగా ఉన్నాయని సామాజిక కార్యకర్త మద్దెల దినేశ్ అన్నారు. బుధవారం డివిజన్‌లోని రోడ్లను పరిశీలించి నిరసన తెలిపారు. అధికారులకు 33వ డివిజన్ కనిపించడం లేదా అని ప్రశ్నించారు. స్థానిక కార్పొరేటర్ రోడ్లను ఎందుకు పట్టించుకోవడం లేదన్నారు. ఆయన వెంట డివిజన్ నాయకులు ఆకాశ్, నరేంద్ర గౌస్, శ్రీనివాస్, ప్రసాద్, రాజు, మహేశ్ తదితరులున్నారు.

వేంనూర్‌లో వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

పాలకుర్తి, నవంబర్27: వేంనూర్‌లో అలివేలు మంగ పద్మావతి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి ఆల య మూడో వార్షికోత్సవం సందర్భంగా బ్రహ్మో త్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. బుధవా రం శ్రీవారి కల్యాణోత్సవం కన్నుల పండుగగా జరిగింది. ఎన్ఆర్ ఐ రాధాకృష్ణ దంపతులు ఈ ఆలయాన్ని నిర్మించారు. ఏటా వైభవంగా బ్రహ్మోత్స వాలు నిర్వహిస్తున్నారు. ఆలయ కమిటీ సభ్యులు అన్నదాన కార్యక్రమం ఏర్పాటుచేశారు.

కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

బాల్య వివాహాలతో భవిష్యత్ అంధకారం

ఫర్టిలైజర్‌సిటీ, నవంబర్ 27: బాల్య వివాహాలతో యువత భవిష్యత్ అంధకారం అవుతుందని గోదావరిఖని ఆదనపు జిల్లా న్యాయమూర్తి డాక్టర్ టీ శ్రీనివాసరావు అన్నారు. బుధవారం మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో అదనపు జిల్లా న్యాయస్థాన ఆవరణలో నిర్వహించిన బాల వివాహ్ ముక్తి భారత్ కార్యక్రమానికి న్యా యమూర్తి హాజరై మాట్లాడారు. విద్యార్థులు చదువుకునే వయస్సులో వివాహం చట్టరీత్యా నేరమన్నారు. దేశ అభివృద్ధి బాల్య వివాహాలతో అంధకారంలోకి వెళుతుందన్నారు. అనంతరం వివిధ అంశాలపై ఆయ న వివరించారు. ఇక్కడ లోక్ అదాలత్ సభ్యురాలు చందాల శైలజ, పులిపాక ప్రవీణ్‌కుమార్, జీ భూమయ్య, సీడబ్ల్యూసీ చైర్మన్ జీ శ్రీధర్, తదితరులు ఉన్నారు.